రోడ్లపై స్టంట్స్ చేస్తే కఠిన చర్యలు

● రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న



ఇంటర్వ్యూ

రాయదుర్గం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాయదుర్గం నాలెడ్జి సిటీ ప్రాంతంలో రోడ్లపై ప్రమాదకరమైన స్టంట్స్ చేస్తూ సామాన్యులను హడలెత్తిస్తున్న బైక్ రైడర్లపై కఠినమైన చర్యలు తీసుకుంటామని రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న హెచ్చరించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వెల్లడించారు.

బైక్ రైడింగ్‌కు పాల్పడుతున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

బైక్ రైడింగ్‌లు, స్టంట్స్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. రైడర్లను అదుపులోకి తీసుకుని బైక్‌లు సీజ్ చేసి కోర్టులో హాజరు పరుస్తున్నాం.

ఇప్పటి వరకు బైక్ రైడర్లపై ఎన్ని కేసులు నమోదు చేశారు? కేసుల ప్రభావం వల్ల రైడర్స్ తగ్గారా?

బైక్ రైడింగ్‌లకు పాల్పడే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సరదాకోసం ఈ ప్రాంతంలో రాత్రివేళల్లో బైక్ రైడింగ్ చేసేవారు. వారిపై అధికారులకు సమాచారం ఇవ్వడంతో తమ ఉద్యోగాలకు సమస్యగా మారుతుందని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు బైక్ రైడింగ్ మానేశారు. ఇప్పుడు వివిధ రంగాల్లో పని చేసే యువత ఎక్కువగా ఈ రైడింగ్‌లకు పాల్పడుతున్నారు.

బైక్ రైడింగ్‌కు పాల్పడుతున్న వారిలో ఏ వర్గానికి చెందిన యువత ఎక్కువగా ఉంటున్నారు?

బైక్ రైడింగ్‌లకు పాల్పడేవారు ప్రస్తుతం చిన్న చిన్న కూలి పనులు, చిరు ఉద్యోగాలు చేసుకునే పేద, దిగువ మధ్య తరగతికి చెందిన యువత ఉంటున్నారు. యువకులు ఖరీదైన బైక్‌లను ఈఎంఐలో కొని బైక్ రైడింగ్‌లు చేస్తున్నాడు.

ఇలాంటి వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

బైక్ రైడింగ్స్ పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా పెట్టాం. వారిని అదుపులోకి తీసుకుని బైక్ సీజ్ చేసి న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నాం. వీరికి న్యాయమూర్తి జైలు, జరిమానా విధిస్తున్నారు. బైక్ రైడింగ్ చేస్తు దొరికిన వారు కోర్టుకు హాజరు కావాల్సి ఉంటుంది. ఇందులో ఒకరిద్దరు కోర్టు వాయిదాకు రాకుంటే మీగతా వారి కేసు కూడా పరిష్కారం కాదు. దీనివల్ల కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తుంది.

కొందరు బైక్ రైడర్స్ స్టంట్స్ చేస్తూ రికార్డు చేసి సోషల్ మీడియాలో పెడుతూ తమను ఎవరూ పట్టుకోరని చెబుతున్నారు?

బైక్ రైడింగ్, స్టంట్స్‌కు పాల్పడే వారిలో ఎక్కువమంది సోషల్ మీడియాలో పెడుతున్నారు. తమను ఎవరు ఏమి చేయరని భ్రమ పడుతున్నారు. ఐటీజోన్‌లో ప్రతిచోట సీసీ కెమెరాలు ఉంటాయి. సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా వారిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేస్తాం. వీరిపై కేసులు నమోదయితే వారు భవిష్యత్‌లో కేసులతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

ఇప్పటి వరకు ఎన్ని కేసులు నమోదు చేశారు?

ఇప్పటి వరకు 200 కేసులు నమోదు చేశాం. రాయదుర్గం నాలెడ్జ్ సిటీ ప్రాంతంలో ప్రతిరోజూ ప్రత్యేక టీంలతో పర్యవేక్షిస్తున్నాం. ఎలాంటి బైక్ రైడింగ్‌లు, విన్యాసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకునేందుకు శని, ఆదివారాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. శుక్రవారం 30 మంది పోలీసులతో నిఘా ఏర్పాటు చేశాం.

నాలా పనులు సాగక నరకం!

● వాహనదారులకు తప్పని ఇక్కట్లు
● అర కిలోమీటర్ దూరానికి 30 నిమిషాల ప్రయాణం



లింగంపల్లి రైల్వే బ్రిడ్జి వద్ద నిలిచిపోయిన వాహనాలు

చందానగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మెరుగైన రవాణా కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి ప్రజారవాణాను సౌకర్యవంతంగా చేయడానికి ప్రభుత్వం కృషిచేస్తుంటే అధికారుల ఆనాలోచిత చర్యలతో ప్రజలు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. అర కిలోమీటరు దూరం వెళ్లాలంటే సుమారు అర గంట సమయం పడుతుంది.. ఇది ఎక్కడో కాదు హైటెక్‌సిటీ శేరిలింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ రద్దీతో వాహన దారుల కష్టాలు వర్ణానాతీతం. చినుకు పడితే ఎగువ ప్రాంతం నుంచి వర్షపునీరు రైల్వే అండర్‌బ్రిడ్జిలోకి చేరుతుంది. అక్కడి నుంచి ఔట్‌లేట్ సరిగా లేకపోవడంతో అండర్ బ్రిడ్జి వద్ద వరదనీరు భారీగా నిలిచి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. 30 ఏళ్ల నుంచి ఇదే పరిస్థితి. దీనిని మెరుగు పరిచేందుకు గతంలో జీహెచ్‌ఎంసీ గ్రేటర్ కమిషనర్ సైబరాబాద్ సీపీ సంయుక్తంగా పరిశీలించి రైల్వే అండర్ గ్రౌండ్‌లో నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అందుకు గాను గత ఏడాది నాలా విస్తర్ణ, లోతు, కల్వర్ట్‌ల నిర్మాణం కోసం రూ.4 కోట్లు మంజూరు అయ్యాయి. వాటిలో నాలా విస్తరణ, కల్వర్టులను నిర్మించారు. అయినా వరదనీరు సాఫీగా వెళ్లడం లేదు. నాలా కిందిభాగంలో సింగూర్ ప్రాజెక్టు నుంచి హైదరాబాద్‌కు తాగునీటి కోసం ఏర్పాటు చేసిన పైపులైన్లు కొంతవరకు ఇబ్బందులు కలిగిస్తున్నప్పటికి మరోవైపు నీరు సాఫీగా వెళ్లేందుకు నాలా లింగంపల్లి కూరగాయాల మార్కెట్ నాలా నుంచి బ్రిడ్జి వరకు నాలాను లెవల్‌గా విస్తర్ణ చేపడితే తప్ప సమస్య పరిష్కారయ్యే మార్గం కనిపించడం లేదు. ఆ దిశగా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే చందానగర్ పీజేఆర్ స్టేడియం నుంచి హుడాకాలనీ వైపు నుంచి, లింగంపల్లి నుంచి వచ్చే వాహనాలు రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి గచ్చిబౌలి వైపునకు వెళ్లాల్సి ఉంది. నాలాను తవ్వి వదిలేయడంతో మరింత సమస్య ఏర్పడుతుంది. ఉదయం, సాయంత్రం పాఠశాలకు వెళ్లి, తిరిగే వచ్చే సమయంలో స్కూల్ బస్సులతో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీనిని తగ్గించేందుకు ట్రాఫిక్ పోలీసులు ఎన్ని చర్యలు తీసుకున్న ఫలితం లేకుండా పోతుంది. తవ్విన నాలా ప్రాంతంలో నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసి లింగంపల్లి మార్కెట్ నాలా నుంచి రైల్వే అండర్ బ్రిడ్జి వరకు ఉన్న నాలా పొడవు, విస్తర్ణ, లోతు పనులు చేపట్టి రవాణాను మెరుగు పరచాలని పలువురు కోరుతున్నారు.

బ్రిడ్జి వరకు విస్తర్ణ పనులు చేపట్టాం

లింగంపల్లి కూరగాయల మార్కెట్ నాలా నుంచి రైల్వే బ్రిడ్జి వరకు ఉన్న నాలా కొన్ని ప్రాంతాల్లో ఎగుడుదిగుడుగా ఉంది. దీంతో నీరు సాఫీగా వెళ్లేందుకు అవకాశాలు లేవు. లో లెవల్ నుంచి లింగంపల్లి అండర్ బ్రిడ్జి వరకు విస్తరిస్తే తప్ప అండర్ బ్రిడ్జి వద్ద నీటి సమస్య పరిష్కారం అవుతుంది. ఆదిశగా పనులు చేస్తున్నాం. -డీఈ ఆనంద్

చందానగర్ సర్కిల్‌లో 23 వెండింగ్ జోన్స్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి

చందానగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ చందానగర్ సర్కిల్ పరిధిలో 23 వెండింగ్ జోన్లు ఏర్పాటు చేశామని చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి అన్నారు. జీహెచ్‌ఎంసీ వివిధ విభాగాల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో 23 వెండింగ్ జోన్లలో రెడ్‌జోన్లు-12, అంబర్‌జోన్లు-10, గ్రీన్‌జోన్-1 గుర్తించామన్నారు. ఈ జోన్లలో వీధి వ్యాపారుల వల్ల ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నా వాటిని అధిగమించే దిశగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎంహెచ్ డాక్టర్ రవి, ఏసీపీ నాగిరెడ్డి, పీఓ ఉషారాణి పాల్గొన్నారు.

● **వెండింగ్ జోన్లు ఇవే...**

బీహెచ్‌ఈఎల్ కూడలి నుంచి మియాపూర్ మెట్రోస్టేషన్ వరకు రోడ్డుకు ఇరువైపులా, డీమార్ట్ నుంచి ఆల్విన్ చౌరస్తా వరకు, ఆల్విన్ చౌరస్తా నుంచి కొత్తగూడ చౌరస్తా వరకు, కొత్తగూడ చౌరస్తా నుంచి నీరూస్ జంక్షన్ వరకు, హైటెక్ సిటీ రైల్వేస్టేషన్ నుంచి మాదాపూర్ సైబర్‌టవర్ వరకు, చందానగర్ ఎంఎంటీస్ రైల్వే స్టేషన్ నుంచి హుడాకాలనీ వరకు. హరిజన బస్తీ నుంచి శ్మశానం వరకు, గుట్టల బేగంపేట శ్మశాన వాటిక వెనుక నుంచి ఆదిత్యనగర్ అండ్ ఫ్లైఓవర్, సుభాష్‌చంద్రబోస్ మెయిన్ రోడ్డు సాయినగర్‌కాలనీ, మెటల్ చార్మినార్ నుంచి హైటెక్స్ వరకు, నీరూస్ జంక్షన్ నుంచి కొత్తగూడ వరకు, మియాపూర్ ఎక్స్‌రోడ్డు నుంచి కూకట్‌పల్లి జంక్షన్ వరకు, హోల్ట్ హాఫీజ్‌పేట రోడ్డు నుంచి వార్డు కార్యాలయం వరకు, జనప్రియ అపార్ట్‌మెంట్స్ నుంచి సాయిబాబా గుడివరకు. జనప్రియ అసోసియేషన్ ఆఫీస్‌రోడ్డు, ఆల్విన్‌కాలనీ నుంచి కమాన్ వరకు, మదీనగూడ ప్రణమ్ హాస్పటల్ వరకు, చందానగర్ శ్రీదేవి థియేటర్ రోడ్డు నుంచి సర్కిల్ లిమిట్ వరకు దీప్తిశ్రీనగర్ కాలనీ నుంచి క్రోమో బిల్డింగ్, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా వరకు.



పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఇబ్బందులు

● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హైదర్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల బాగోగులు పట్టించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ చేసిన అభివృద్ధిని ప్రజలు మరచిపోలేదని, హైదరాబాద్‌ను ప్రపంచంలోనే ప్రత్యేక నగరంగా తీర్చిదిద్దారని అన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనుల నిర్వహణకు ఒక్క రూపాయి కూడా వెచ్చించలేని స్థితికి జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ విభాగాలు చేరాయన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మందాడి శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ రాజేష్, సాయిబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయండి

● ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



రోడ్డు డివైడర్ ఆర్‌సీసీ గ్రిల్స్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హైదర్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ కాలనీలో రూ.1.50 కోట్లతో జరుగుతున్న రోడ్డు డివైడర్ ఆర్‌సీసీ గ్రిల్స్‌తో నిర్మిస్తున్న పనులను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ గురువారం అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణానికి బాటలు వేసేందుకు వీలుగా రోడ్డు మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, రామకృష్ణనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పురేందర్‌రెడ్డి, స్థానికులు ప్రసాద్, మాధవ్, నిఖిల్ పాల్గొన్నారు.

గోకుల్‌ప్లాట్స్ వాసుల వినతి

మాదాపూర్ డివిజన్ గోకుల్‌ప్లాట్స్ వాసులు చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సమస్యలపై శుక్రవారం ఎమ్మెల్యే గాంధీని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

మాదాపూర్ గోకుల్‌ప్లాట్స్‌కు చెందిన నాంచారమ్మ, కొండాపూర్ సిద్ధిక్‌నగర్‌కు చెందిన మణి వైద్య చికిత్స ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. వారికి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే గాంధీ శుక్రవారం పంపిణీ చేశారు. నాచారమ్మకు రూ.60 వేలు, మణికి రూ.60 వేలు మంజూరైనట్లు ఆయన తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం



ఆలయ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్‌నగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శుక్రవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పూజలందుకుంటున్న పెద్దమ్మతల్లి అమ్మవారికి ఆలయాన్ని నిర్మించడం సంతోషంగా ఉందన్నారు.

కార్యక్రమంలో స్థానికులు రవి, శ్రీనివాస్, షౌకత్‌అలీమున్నా, అగ్రవాసు, మహేష్, నాగయ్యగౌడ్, సౌందర్య, నాగేశ్వరరావు, మహేష్, నాగేష్, కృష్ణ, గోపిచారి, రాజు, బాలు, శ్రీను, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్



రోడ్డు, డివైడర్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రోజాదేవి

హైదర్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్ వివేకానందనగర్ కాలనీలో జరుగుతున్న సెంటర్ డివైడర్, సిమెంటు రోడ్డు పనులను ఏఈ శ్రావణి, స్థానికులతో కలిసి శుక్రవారం కార్పొరేటర్ రోజాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివేకానందనగర్‌లో సెంటర్ డివైడర్ లేక పాదచారులు, వాహనదారులు రోడ్డు దాటుతూ ప్రమాదాలకు గురవుతున్నారని, డివైడర్, రోడ్డు పనులు పూర్తయితే ప్రజలకు, వాహన దారులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తిచేయాలన్నారు.

కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, రామకృష్ణ, పురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు



సీసీరోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేస్తున్నామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గౌలిదొడ్డిలో జరుగుతున్న సీసీరోడ్డు పనులను కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. స్థానికంగా ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. డివిజన్‌లో ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తునమన్నారు. నాయకులు తిరుపతి, భిక్షపతి, ప్రసాద్, సునీల్, ప్రసాద్, సునీల్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చాట్ పండుగకు ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చాట్ పండుగ సందర్భంగా ప్రయాణికుల డిమాండ్ మేరకు వేర్వేరు ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. నవంబర్ 2,9 తేదీల్లో చాప్రా-యశ్వంత్‌పూర్ (05185), 4, 11తేదీల్లో యశ్వంత్‌పూర్-చాప్రా (05186), 3న ఎస్‌ఎంవీటి బెంగళూరు-ధనపూర్ (06235), 9న ధనపూర్-ఎస్‌ఎంవీటీ బెంగళూరు (06236) రైళ్లను నడుపుతున్నట్టు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, నిర్వహణ కారణాలతో అక్టోబర్ 26న సికింద్రాబాద్-గూడూరు (12710), 27న గూడూరు- సికింద్రాబాద్ (12709) రైళ్లను రద్దు చేసినట్టు తెలిపారు.

క్యారమ్స్‌లో ఆదిత్య ముందంజ



క్యారమ్స్ ఆడుతున్న ఆదిత్య

హైదరాబాద్: సీబీఆర్ ప్రసాద్ తెలంగాణ స్టేట్ సీనియర్ ఓపెన్ ర్యాంకింగ్ క్యారమ్స్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన ఎస్. ఆదిత్య ముందంజ వేశాడు. శుక్రవారం గొల్లూరులోని సీబీఆర్ ఇండోర్ స్పోర్ట్స్ హాల్‌లో జరిగిన ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్‌లో హనుమంతు (మెదక్)పై ఆదిత్య వరుస గేముల్లో గెలిచాడు. ఇతర మ్యాచుల్లో వీఎస్‌కే నాయుడు, జగన్, నందుకుమార్, సాయిఈశ్వర్, సాగర్, శివప్రసాద్, రవీందర్‌గౌడ్, శివానందరెడ్డి, విక్రమ్‌కుమార్, నితిన్‌గౌడ్ ప్రత్యర్థులను ఓడించారు.

మలేషియన్ వర్సిటీతో 'గోకరాజు' ఎంఓయూ

● అకడమిక్ సంబంధాల బలోపేతమే లక్ష్యం: జీవీకేరాజు



ఎంఓయూ పత్రాలు చూపిస్తున్న గోకరాజు ఇంజనీరింగ్ కాలేజీ, కర్టిన్ యూనివర్సిటీ ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అకడమిక్ సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా మలేషియాలోని కర్టిన్ యూనివర్సిటీతో గోకరాజు రంగరాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని కళాశాల ఉపాధ్యక్షుడు జీవీకే గంగరాజు తెలిపారు. శుక్రవారం మలేషియాలో జరిగిన ఎంఓయూ కార్యక్రమం అనంతరం గోకరాజు కళాశాల సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ కేవీఎస్ రాజు మాట్లాడుతూ అంతర్జాతీయ భాగస్వామ్యాలను సృష్టించేందుకు, విద్యార్థుల ప్రయోజనాలను మెరుగుపరచడానికి మలేషియన్ యూనివర్సిటీతో ఎంవోయూ దోహదపడుతుందన్నారు.

తమ కళాశాల్లో చదువుతున్న బీటెక్ థర్డ్, ఫైనలియర్ విద్యార్థులు మలేషియాలోని కర్టిన్ యూనివర్సిటీ నిర్వహించే ప్రాజెక్టుల్లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కర్టిన్ విశ్వవిద్యాలయం ప్రొ. వైస్ చాన్సలర్ విన్సెంట్ లీ చియెంగ్ చెన్ మాట్లాడుతూ ఈ ఎంఓయూ రెండు సంస్థలకు ప్రయోజనకరంగా ఉంటుందని, విద్యార్థులకు, అధ్యాపకులకు అసమానమైన అవకాశాలకు ఉపకరిస్తుందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో గోకరాజు కళాశాల డీన్ స్వదేశ్‌కుమార్ సింగ్, కర్టిన్ విశ్వవిద్యాలయం ప్రతినిధి లిమ్ చై ఇంగ్, డాక్టర్ మూల మోహన్ రెడ్డి, ప్రొఫెసర్ సుజన్ దేబ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆలయ బ్రహ్మోత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

చందానగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చందానగర్ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణం కనులపండువగా కొనసాగింది. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

సాయంత్రం స్వామివారికి పల్లకి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చక బృందం, మిరియాల రాఘవరావు, ప్రీతం, భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శన



కళాకారుల నాట్య ప్రదర్శన

మాదాపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని శిల్పారామంలో గీతికా కూచిపూడి డాన్స్ అకాడమి నాట్య గురువులు లక్ష్మి అనంత కృష్ణ శిష్యబృందం కూచిపూడి ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. విఘ్నరాజం భజే, గణేశా స్తుతి, గణేశాకౌతం, అన్నమాచార్య కీర్తనలు, జతిస్వరం, సరస్వతి స్తుతి, చంద్రచూడా, తిల్లాన తదితర అంశాలపై చక్కటి ప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు.

నేడు బీహెచ్‌ఈఎల్‌లో రక్తదాన శిబిరం

భెల్‌కాలనీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తలసీమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల సహాయార్థం శనివారం బీహెచ్‌ఈఎల్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని టౌన్‌షిప్ అడ్మినిస్ట్రేషన్ ఎస్టేట్ ఏజీఎం సురన్ ప్రసాద్ తెలిపారు. బీహెచ్‌ఈఎల్ యాజమాన్యం-తలసీమియా సిక్కల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం టౌన్‌షిప్‌లోని ఇటర్నేషనల్ క్లబ్ ఆవరణలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రక్తదాతలు, యువకులు కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

యువకుడి ఆత్మహత్య

మారేడుపల్లి అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యలతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కార్ఖానా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఫోర్ట్ ఉత్తరాయ ప్రాంతానికి చెందిన పి.మోహన్(24) శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లో ఇనుప రాడ్డుకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కుటుంబ సమస్యలతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు కార్ఖానా పోలీసులు అభిప్రాయపడుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ధర్నాకు బీజేపీ శ్రేణులతో కలిసి తరలివెళ్తున్న రవికుమార్‌యాదవ్

ఇందిరాపార్కు వద్ద ధర్నాకు తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు

గచ్చిబౌలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరా పార్కువద్ద మూసీ బాధితులకు అండగా బీజేపీ చేపట్టిన మహాధర్నాకు శేరిలింగంపల్లి నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో సుమారు 300 మంది కార్యకర్తలు తరలివెళ్లారు. నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ రాఘవేందర్‌రావు, నాయకులు ఎల్లేశ్, వసంతకుమార్ యాదవ్, రాధాకృష్ణ, ఆంజనేయులు, సాగర్, నర్సింగ్ యాదవ్, అజిత్ తరలివెళ్లారు.



సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ) ఆధ్వర్యంలో సైబరాబాద్ పరిధిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులకు సహకరిస్తున్న ట్రాఫిక్ వలంటీర్లను గచ్చిబౌలి కమిషనరేట్‌లో శుక్రవారం అభినందిస్తున్న జాయింట్ సీపీ (ట్రాఫిక్) జోయల్ డేవిస్. - హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

ధర తక్కువ.. నాణ్యత ఎక్కువ!

- కూరగాయలు కొనండి.. రైతులను ప్రోత్సహించండి!
- కూకట్‌పల్లి రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్‌రావు



ఇంటర్వ్యూ

రైతులను ప్రోత్సహిస్తూ తక్కువ ధరకు నాణ్యతతో కూడిన కూరగాయలు, ఆకు కూరలను నగర ప్రజలకు అందించడానికి 1999లో కూకట్‌పల్లి రైతు బజార్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం ఇక్కడికి రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, సిద్ధిపేట జిల్లాల నుంచి సుమారు 500-600 మంది రైతులు వచ్చి తమ పొలాల్లో పండించిన తాజా కూరగాయాలు, ఆకు కూరలను విక్రయిస్తుంటారు. రైతు కష్టం తెలిసిన వారు ఎక్కువగా ఏ స్థాయిలో ఉన్నా ఇక్కడకు వచ్చి ఇంట్లోకి అవసరమైన కూరగాయలు కొనుగోలు చేస్తూ రైతులను ప్రోత్సహించడంలో భాగస్వామ్యం అవుతున్నామన్న సంతృప్తితో చాలా మంది వస్తున్నారని శుక్రవారం ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో కూకట్‌పల్లి రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కందిమళ్ల సుధాకర్‌రావు పలు విషయాలను వెల్లడించారు.

\- కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి)

రైతుబజార్‌లో క్రయ, విక్రయాలు ఎలా ఉన్నాయి ?

ఇక్కడ 254 స్టాళ్లల్లో రైతులు, 150 స్టాళ్లలో స్వయం సహాయక సంఘం సభ్యులు రోజూ 800 నుంచి 900 క్వింటాళ్లు, శని, ఆదివారాల్లో 1200 నుంచి 1400 క్వింటాళ్ల కూరగాయలు, ఆకు కూరలు అమ్ముతుంటారు. ప్రతిరోజూ 3 నుంచి 4 వేల మంది, శని, ఆదివారం అయితే 6 వేల మంది ప్రజలు తమకు నచ్చినవి కొనుగోలు చేస్తారు. బయట ఎక్కడా అందుబాటులో లేని కూరగాయలు, ఆకు కూరలు ఇక్కడ ఉంటాయి.

రైతు బజార్‌కొచ్చే వారికి వాహనాల పార్కింగ్ ఉందా?

రైతుబజార్ భవనం కింద సెల్లార్‌లో 45 నుంచి 50 కార్లు పార్క్ చేసుకోవచ్చు. సెల్లార్, రైతుబజార్ ప్రహరీ లోపల చుట్టూ 350 నుంచి 400 ద్విచక్ర వాహనాలు కూడా నిలుపుకోవచ్చు. ద్విచక్ర వాహనాలకు రూ. 10, మూడు, నాలుగు చక్రవాహనాలకు రూ. 20 చొప్పున ప్రైవేట్ ఏజెన్సీ చార్జి చేస్తుంది. పార్కింగ్ అలాట్‌మెంట్, రుసుము చెల్లింపు అంతా కూడా ప్రభుత్వ నిర్ణయం మేరకు నడుస్తుంది.

రైతుబజార్‌లో కూరగాయలు కొనేందుకు కారణాలు..?

ధర తక్కువ, నాణ్యత ఎక్కువ అని చెప్పొచ్చు. సూపర్ మార్కెట్లు, కార్పొరేట్ కూరగాయల అవుట్‌లెట్స్‌లో కొనడం కన్నా రైతుబజార్‌లో కొంటే నేరుగా ఆ డబ్బు రైతు అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యామన్న సంతోషం కలుగుతుంది. ఏ రోజు సరుకు అదే రోజు అమ్ముకొని రైతు ఇంటికి వెళ్తారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మీరు కొనుగోలు చేయొచ్చు. కుటుంబ సమేతంగా రైతుబజార్‌కొస్తే రైతులు ఎలా ఉంటారో కూడా ప్రస్తుతం నగరంలో పుట్టి, పెరుగుతున్న పిల్లలకు తెస్తుంది.

ఎక్కడెక్కడి నుంచి రైతులు వస్తారు?

రైతుబజార్‌కు నాలుగు జిల్లాల నుంచి రైతులు వస్తున్నారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి, వికారాబాద జిల్లా వికారాబాద్, నవాబ్‌పేట్, మోమిన్‌పేట్, మర్పల్లి, సిద్దిపేట జిల్లా సిద్ధిపేట, తోగుట్ట, గజ్వేల్, సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలాల పరిధిలో సుమారు 70 నుంచి 80 గ్రామాల రైతులు కూరగాయలు, ఆకు కూరలు, ఉల్లి గడ్డలు, పండ్లు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. శని, ఆదివారం అయితే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, కార్పొరేట్ కంపెనీల్లో పనిచేసే ఉన్నతస్థాయి క్యాడర్, వ్యాపార వేత్తలు సైతం వచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తూ రైతులను ప్రోత్సహిస్తున్నారు.

రైతుబజార్ వేళలు? భద్రతపై మీరేమంటారు?

కూకట్‌పల్లి రైతుబజార్ 365 రోజులపాటు 24/7 తెరిచే ఉంటుంది. ప్రతి బుధవారం రైతుబజార్‌కు సెలవు. పరిసరాల పరిశుభ్రత, మార్కెట్‌ను శుభ్రం చేస్తాం. రైతుల రాకపోకలతో రాత్రంతా తెరిచే ఉంటుంది. కొనుగోలుదారుల కోసం మాత్రం రైతులు, గ్రూపు సభ్యులు ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు విక్రయిస్తారు. రైతుల వద్ద లేని వాటిని మాత్రమే గ్రూపు సభ్యులు భరత్‌నగర్, బోయిన్‌పల్లి మార్కెట్ నుంచి తెచ్చి ఇక్కడ విక్రయిస్తారు. రైతులను ప్రోత్సహించడమే రైతుబజార్ ఏర్పాటు ఉద్దేశం. రెండు విడతల్లో ఆరుగురు సూపర్‌వైజర్లు, 45 సీసీ కెమెరాలతో నిత్యం పర్యవేక్షిస్తున్నాం. ఎలాంటి సూచనలు, సలహాలు, ఫిర్యాదులు ఉన్నా రైతుబజార్ కార్యాలయంలో సంప్రదించొచ్చు.

కూకట్‌పల్లి రైతు బజార్‌లో ధరలు



కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతు బజార్‌లో కిల్లో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ.35, వంకాయ రూ. 40, బెండకాయ రూ. 65, పచ్చి మిర్చి రూ. 35, బజ్జి మిర్చి రూ. 65, కాకరకాయ రూ. 38, బీరకాయ రూ.55, క్యాబేజీ రూ.19, బీన్స్ రూ.115, క్యారెట్ రూ.45, గోబి పువ్వు రూ.23, దొండకాయ రూ.35, చిక్కుడు కాయ రూ.85, గోరు చిక్కుడు రూ.55, బీట్‌రూట్ రూ.37, క్యాప్సికం రూ.75, ఆలుగడ్డ రూ.37, కీర రూ.31, దోసకాయ రూ.40, సొరకాయ రూ.25, పొట్లకాయ రూ.18, కంద రూ.60, ఉల్లిపొరక రూ.55, ఉల్లిగడ్డ రూ.50, మామిడి కాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామగడ్డ రూ.37, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ.40, గుమ్మడికాయ రూ.30, నిమ్మకాయలు రూ.50-60, మునగ కాయలు రూ.8-10, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండుమిర్చి రూ.220, అల్లం రూ.160, వెల్లుల్లి రూ.380, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.100, కరివేపాకు రూ.70, పర్వల్ రూ.45, పల్లికాయ రూ.65, లోబా రూ.40, ఆ కాకరకాయ రూ.100. పైన పేర్కొన్న ధరలు ఈరోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఏఐఎంఎంఎస్ విద్యార్థుల ఆందోళన



కేపీహెచ్‌బీలోని ఏఐఎంఎంఎస్‌లో పారామెడికల్ ఒకేషనల్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు తమకు సర్టిఫికెట్లు ఇప్పించాలని శుక్రవారం కూకట్‌పల్లి పోలీసులను ఆశ్రయించారు. ఆరు రోజులుగా మేము ఆందోళన చేస్తున్నా మమ్మల్ని పట్టించుకోవడం లేదని బాధిత విద్యార్థులు వాపోయారు.

\- కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి)

ధన్‌తేరాస్.. పసిడి కొందాం పదా!

భారతీయులకు పసిడిపై ఉన్న మక్కువ అంతా ఇంతా కాదు. ఏ వేడుక ఉన్నా ఎంతో కొంత బంగారం కొనడం మనకు ఆనవాయితీగా వస్తోంది. ఆడపిల్లల తల్లిదండ్రులు అయితే బిడ్డ పుట్టినప్పటి నుంచీ పెండ్లి వరకు బంగారం కొంటూనే ఉంటారు. ఫంక్షన్ ఏదైనా సరే మహిళలు బంగారు ఆభరణాలు ధరిస్తేనే వారికి సంతోషం. ఈనెల 29వ తేదీన ధన్‌తేరాస్ రావడంతో పసిడి దుకాణ దారులు కస్టమర్ల సెంటిమెంట్‌ను క్యాష్ చేసుకునే పనిలో పడ్డారు. షాపులను అందంగా ముస్తాబు చేయడంతో పాటు ఆఫర్లు అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. దీంతో ఆ రోజు ఎంతో కొంత బంగారం కొంటే శుభం కలుగుతుందని, లక్ష్మీదేవి ఇంటికి వస్తుందనే నమ్మకం. ధన్‌తేరాస్ సందర్భంగా పసిడి కొనుగలుదారుల అవగాహన కోసం ప్రత్యేక కథనం.

\- కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి)

- ముందే బుకింగ్ చేసుకుంటే కస్టమర్లకే లాభం
- ఆఫర్లను క్షుణ్ణంగా పరిశీలిస్తేనే ప్రయోజనం
- కస్టమర్ల సెంటిమెంట్‌ను క్యాష్ చేసుకునే పనిలో దుకాణ దారులు
- ధర ఒకే.. తరుగు, మజూరీ చార్జీలపై ఓ కన్నేయండి



ఆఫర్లను పరిశీలిస్తేనే..

బంగారు ఆభరణాలు కొనుగోలు చేయాలనుకునే వారికి ధన్‌తేరాస్ సందర్భంగా కాస్తోకూస్తో లాభమే అంటున్నారు. పసిడి ధరపై ఎప్పుడూ ఎవ్వరూ డిస్కౌంట్ ఇవ్వరన్న విషయం గుర్తుంచుకోవాలి. కస్టమర్లకు తరుగు, మజూరీ చార్జీలపైనే ఎంతో కొంత రాయితీ ఇస్తూ పసిడి అమ్మేస్తుంటారు.

ధన్‌తేరాస్ రోజు హడావిడిగా వెళ్లి కొనుగోలు చేసే బదులు.. ఆలోపు మీరు అడ్వాన్స్‌గా నగలు బుకింగ్ చేసుకుంటే ఏ రోజు తక్కువ ఉంటే ఆ రోజు ధరకు ఆభరణాలు ఇస్తామని చెప్పడంవల్ల కస్టమర్లకు ప్రయోజనం కలుగుతుంది. గల్లీలో ఉండే దుకాణం మొదలు కొని అంతర్జాతీయంగా వ్యాపారం చేస్తున్న పెద్దపెద్ద పసిడి దుకాణాల వరకు కస్టమర్లను ఆకట్టుకొని సాధ్యమైనంత ఎక్కువ వ్యాపారం చేసేందుకు వారం, పది రోజుల ముందుగానే అడ్వాన్స్ బుకింగ్ అంటూ ఊరిస్తుంటారు.

కొన్ని బంగారం దుకాణాల్లో తరుగుపై భారీ డిస్కౌంట్స్ ఇవ్వగా.. కొన్నింటిలో గోల్డ్ కాయిన్స్, ఎంత కొంటే అంత బంగారం, క్రెడిట్ కార్డుపై కొంటే క్యాష్ బ్యాక్, పాత బంగారం ఎక్ఛేంజ్‌పై ప్రత్యేక రాయితీలకు శ్రీకారం చుట్టారు. డజన్ల కొద్దీ పసిడి దుకాణాలకు వెళ్లే ఓపిక లేకపోవడంతో ఇంటికి సమీపంలోనే ఏదో ఒక దుకాణంలో కొనుగోలు చేయడంవల్ల నష్టపోవడం ఖాయం. అందుకే కేపీహెచ్‌బీ జాతీయ రహదారికి ఇరువైపుల కిలోమీటరు వ్యవధిలో పేరు గాంచిన జ్యువెలరీ దుకాణాలు ఉన్నాయి. ఆఫర్లతో పాటు మీకు నచ్చిన బంగారు ఆభరణాలను మిగతా రోజులతో పోలిస్తే దంతేరాస్ వేడుకల్లో కొనుగోలు చేయొచ్చు.

సెంటిమెంట్ కోసమైతే..

ఇప్పుడు బంగారు ఆభరణాలు కొనసాల్సిన అవసరం లేని వ్యక్తులు ధన్‌తేరాస్ సెంటిమెంట్ కోసమైతే నగలకు బదులు గోల్డ్ కాయిన్స్ కొనుగోలు చేయొచ్చు. లక్ష్మీదేవి బొమ్మతో కాయిన్స్ అందుబాటులో ఉన్నాయి. అవసరం లేకపోయినా ఆభరణాలు కొని లక్ష రూపాయలకు అదనంగా రూ. 8 వేల నుంచి రూ. 32వేల వరకు వీఏ, మేకింగ్ కోసం ఖర్చు పెట్టడం అవసరమా? అదే మీరు కాయిన్ కొనడం ఒక్క జీఎస్టీ మినహాయిస్తే తరుగు, మజూరీ చార్జీలు ఏమీ ఉండవు. మీరు ఎప్పుడైనా నచ్చిన డిజైన్స్ ప్రకారం ఆ కాయిన్స్‌తో ఆభరణాలు చేయించుకోవచ్చు.

చాట్ పండుగకు ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చాట్ పండుగ సందర్భంగా ప్రయాణికుల డిమాండ్ మేరకు వేర్వేరు ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. నవంబర్ 2, 9 తేదీల్లో ఛాప్రా-యశ్వంత్‌పూర్ (05185), 4, 11తేదీల్లో యశ్వంత్‌పూర్-ఛాప్రా (05186), 3న ఎస్ఎంవీటి బెంగళూరు-ధనపూర్ (06235), 9న ధనపూర్-ఎస్ఎంవీటీ బెంగళూరు(06236) రైళ్లను నడుపుతున్నట్టు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, నిర్వహణ కారణాలతో అక్టోబర్ 26న సికింద్రాబాద్-గూడూరు (12710), 27న గూడూరు-సికింద్రాబాద్ (12709) రైళ్లను రద్దు చేసినట్టు తెలిపారు.

2 నుంచి కార్తీక పూజలు

అల్లాపూర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నవంబరు 2వ తేదీ నుంచి కార్తీక మాసం సందర్భంగా మోతీనగర్‌లోని శృంగేరీ శారదా శంకరమఠంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు పట్టికను విడుదల చేశారు. నవంబరు 2, శనివారం గోపూజతో మొదలయ్యే కార్తీక మాసం ప్రత్యేక కార్యక్రమాలు నెల రోజుల పాటు కొనసాగుతాయని మఠం ప్రతినిధి సీఎస్ఆర్ మూర్తి తెలిపారు. చంద్రమౌళీశ్వర స్వామికి నిత్యాభిషేకం, సోమవారాల్లో మహాన్యాసపూర్వక అభిషేకం, ఏకాదశి, పౌర్ణమికి ప్రత్యేక పూజల్లో పాల్గొనే వారు మోతీనగర్‌లోని మఠంలో సంప్రదించాలని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

శ్మశానవాటిక స్థలాన్ని కబ్జా చేస్తే చర్యలు

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ప్రశాంత్‌నగర్‌లో శ్మశానవాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

బాలానగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ స్థలాలు, శ్మశానవాటికలను ఎవరైనా కబ్జా చేయాలని చూస్తే ఊరుకోమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హెచ్చరించారు. ప్రశాంత్‌నగర్ పాత కోర్టు భవనం ఎదురుగా ఉన్న శ్మశానవాటిక స్థలాన్ని కొందరు తప్పుడు సర్వే నెంబర్లతో పత్రాలు సృష్టించి కబ్జా చేస్తున్నారని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆయన శుక్రవారం శ్మశానవాటికను పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్మశాన వాటిక కోసం సర్వే నెంబర్ 200లో ఐదెకరాల స్థలాన్ని కేటాయించామని, దీనికి సంబంధించిన పూర్తి సమాచారం, రికార్డులు రెవెన్యూ అధికారుల వద్ద ఉన్నాయని వివరించారు. కొందరు శ్మశానవాటిక స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించడం సిగ్గు చేటన్నారు. కబ్జాకారులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఈ విషయమై జీహెచ్ఎంసీ, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట స్థానికులు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ధోబీఘాట్‌ను సందర్శించిన ఎమ్మెల్యే

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ ఏడోఫేజ్‌లోని ధోబీఘాట్‌ను కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సందర్శించారు. అక్కడ కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై డీఈ శ్రీదేవి, ఏఈ సాయిప్రసాద్‌లతో చర్చించారు.

ప్రజల బాగోగులు పట్టించుకోని కాంగ్రెస్

హైదర్‌నగర్: మహానగరంలో ప్రజల బాగోగులు పట్టించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో ఉండి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆయన కూకట్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్, కేటీఆర్ చేసిన అభివృద్ధిని ప్రజలు మరచిపోలేదని, హైదరాబాద్‌ను ప్రపంచంలోనే ప్రత్యేక నగరంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. 10 నెలల కాంగ్రెస్ హయాంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనుల నిర్వహణకు ఒక్క రూపాయి కూడా వెచ్చించలేని స్థితికి జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ విభాగాలు చేరాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో వేలాది కోట్లతో కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామన్నారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు వారి సమస్యల తెలుసుకుని పరిష్కారానికి కృషిచేద్దామని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మందాడి శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ రాజేష్, సాయిబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్యోత్స్నాశివారెడ్డికి శుభాకాంక్షలు



జ్యోత్స్నారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీపీసీసీ లేబర్‌సెల్ నాయకులు

బాలానగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యా కమిషన్ సభ్యురాలిగా బాధ్యతలు చేపట్టిన కందాడి జ్యోత్స్నాశివారెడ్డిని టీపీసీసీ లేబర్ సెల్ నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ లేబర్ సెల్ అధ్యక్షుడు సప్పిడి భాస్కర్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా టీపీసీసీ లేబర్ సెల్ అధ్యక్షుడు కందాడి సుదర్శన్ మహేశ్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్ తదితరులు జ్యోత్స్నా శివారెడ్డిని కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసి పునర్‌నిర్మాణానికి మార్గదర్శకాలు రూపొందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆమెను కోరారు. తెలుగు భాష సంస్కృతిని ప్రోత్సహించి విద్యాకమిషన్, ప్రభుత్వం తరుపున తెలంగాణలో విద్యార్థులందరికీ న్యాయం జరిగేలా చూడాలని విద్యాకమిషన్ మెంబర్‌కు వారంతా విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు నగదు పారితోషకం



విద్యార్థులకు నగదు పారితోషకాన్ని అందజేస్తున్న పట్లోళ్ల నాగిరెడ్డి గోవిందాచారుల ట్రస్టు ఫౌండర్ శేషావతారం

ఫతేనగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యలో అత్యంత ప్రతిభను కనబరుస్తున్న భరత్‌నగర్ స్ప్రింగ్స్ స్కూలుకు చెందిన ఇద్దరు విద్యార్థులకు గోవిందాచారుల ట్రస్టు నిర్వాహకులు నగదు పారితోషకాన్ని అందజేసి అభినందించారు. ఒక్కో విద్యార్థికి రూ. 5000వేల చొప్పున ఇద్దరు విద్యార్థులకు ఈ నగుసు అందజేశారు. ఈ పారితోషకాన్ని భరత్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, భరత్‌నగర్ హరిహరా క్షేత్రం ఆలయ కమిటీ చైర్మెన్ పట్లోళ్ల నాగిరెడ్డితో కలిసి గోవిందాచారుల ట్రస్టు ఫౌండర్ శేషావతారం అందజేశారు. అనంతరం సమాజాన్ని ప్రభావితం చేసే అంశాలతో కూడిన పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఇగ్నేశ్వర్‌రావు, సూర్యనారాయణ మూర్తి, స్ప్రింగ్స్ స్కూల్ హెచ్ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సప్దర్ నగర్‌లో గ్యార్వీ-షరీఫ్ ఉత్సవం



పాల్గొన్న బండి రమేష్

అల్లాపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జమీర్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి అల్లాపూర్ డివిజన్ సప్దర్‌నగర్‌లో గ్యార్వీ-షరీఫ్ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, మూడువేల మందికి అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు. కార్యక్రమానికి ముస్లిం పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, తూము వేణు, మోయిజుద్దీన్, విటల్, కనకయ్య, మస్తాన్, సయద్ ఎజాజ్, నజీర్, ఇర్ఫాన్, శివ, సంతోష్ పాల్గొన్నారు.

మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రంజిత్‌కుమార్



మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మంద రంజిత్‌కుమార్ నియమితులయ్యారు. బద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రానికి చెందిన రంజిత్ కుమార్ తెలంగాణ మలిదశ ఉద్యమం, జేఎస్‌టీయూ జాక్ అధ్యక్షులుగా, దళిత హక్కులపై పోరాటాలు చేశారు. ఈమేరకు శుక్రవారం మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. విద్యార్థి, దళిత సంఘాల నాయకులు రంజిత్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు.

\- కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి)

సీఎం స్నేహితుడు మా భూమిని కబ్జా చేశారు

- సీఎం రేవంత్ జోక్యం చేసుకోవాలని బాధితుల విన్నపం
- నిందితులకు పోలీసులు సహకరిస్తున్నారని ఆరోపణ



రేకుల షెడ్ల ఫొటోలు చూపిస్తున్న బాధితులు

ఖైరతాబాద్/హైదరాబాద్ సిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కబ్జాదారులకు పోలీసులు అండగా ఉండి వేధింపులకు పాల్పడుతున్నారని, సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని తమ భూమి తమకు అప్పగించాలని బాధితులు వేడుకున్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, ఆయన కుమారుడు రాకేష్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఉదయ్ శేఖర్‌రెడ్డి, బాధితులు ఎస్.అరుణాదేవి, ఎస్.కృష్ణ మాట్లాడారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా తిరుమలగిరిలోని సర్వే నెంబర్లు 398, 399, 409, 410, 411/1, 411/2, 579లోని మొత్తం 19.18 ఎకరాల భూమిని తాము 1968లో కొనుగోలు చేశామని బాధితులు తెలిపారు. అయితే కొంతకాలం క్రితం సీఎం స్నేహితుడు తమ భూమిని కబ్జా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ దాదాపు 100 మంది ఆయుధాలతో తమ స్థలంలో ఉన్నారన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉండి రెండు సార్లు మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన సూర్యనారాయణరెడ్డి సైతం బాధితుడిగా మారినట్లు వారు తెలిపారు. రాచకొండ సీపీని కలవగా తమనే బెదిరించారని, హన్మంతరావు ద్వారా సీఎం రేవంత్ బ్రదర్స్‌ను కలవాలని చెప్పారని ఆరోపించారు. ఈ విషయంపై డీజీపీకి కూడా ఫిర్యాదు చేశామన్నారు. సీఎం రేవంత్ జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు

ఈ భూమి విషయంపై దర్యాప్తు నడుస్తోందని.. ఈ క్రమంలో కొందరు నిరాధారమైన కథనాలు, వీడియోలు పోస్ట్ చేసి ప్రజలను తప్పుదోవ పట్టించడమే కాక, పోలీసులపై, ప్రభుత్వ పెద్దలపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని రాచకొండ పోలీసులు చెబుతున్నారు. ఈ విషయంలో పోలీసులకు, ప్రభుత్వ పెద్దలకు ఎలాంటి సంబంధం లేదని, తప్పుడు ప్రచారం చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.



- ఫతేనగర్ డివిజన్ పరిధి పైప్‌లైన్ రోడ్డు జవహర్‌నగర్ కాలనీ కాళికాదేవి, శాతలాదేవి, కనకదుర్గా ఆలయంలో ఆశ్వయుజ మాసం చివరి శుక్రవారం అర్చకుడు డి.కాశీనాథ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి నిర్వహించిన అభిషేకంలో మహిళలు పాల్గొన్నారు.

\- ఫతేనగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి)

హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న అధికారులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లోని హోటళ్లలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఏజీ కాలనీలోని మహ్మదీయ షవర్మలో చికెన్ గ్రిల్‌పై దుమ్ము పడేలా ఉందని, గాలికి ఉంచడంతో కలుషితమయ్యే అవకాశముందని గుర్తించారు. ఆయిల్ ఎక్కువసార్లు వినియోగిస్తున్నట్టు, ఫ్లోరింగ్‌లో ఉన్న పగుళ్ల నుంచి ఎలుకలు వచ్చే అవకాశముందని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. యూసుఫ్‌గూడ రాజీవ్‌నగర్‌లోని అల్ ఖాసీమ్ ది మండి హౌస్‌లో ఫ్లోరింగ్, ఫ్రీజర్‌లు అపరిశుభ్రంగా ఉన్నాయని, ఎగ్జాస్ట్ ఫ్యాన్ శుభ్రపర్చలేదని, స్టవ్, పాత్రలు శుభ్రపరచలేదని, కొన్ని ఆహార పదార్థాలు నేరుగా ఫ్లోర్‌పై ఉంచినట్టు గుర్తించారు. యూసుఫ్‌గూడలోని అల్‌మటమ్ అల్ మదీనా మండి కిచెన్‌లో మైక్రో ఓవెన్, ఇతర పరికరాలు క్లీన్ చేయడం లేదని, సిబ్బంది హెడ్ క్యాప్‌లు, గ్లోవ్స్ వినియోగించడం లేదని గుర్తించారు. యూసుఫ్‌గూడలోని అల్‌మటమ్ అల్‌హింద్ అరేబియన్ మండిలో అపరిశుభ్రంగా కిచెన్, చిమ్నిలున్నాయని, ఎగ్జాస్ట్ ఫ్యాన్లు క్లీన్ చేయలేదని, కిచెన్ అంతటా ఆహార వ్యర్థాలు ఉండడం, రా మెటీరియల్‌ను ప్రమాణాల ప్రకారం నిల్వ చేయలేదని గుర్తించారు.

క్యారమ్స్‌లో ఆదిత్య ముందంజ



ఆదిత్య

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సీబీఆర్ ప్రసాద్ తెలంగాణ స్టేట్ సీనియర్ ఓపెన్ ర్యాంకింగ్ క్యారమ్స్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన ఎస్. ఆదిత్య ముందంజ వేశాడు. శుక్రవారం గొల్నారులోని సీబీఆర్ ఇండోర్ స్పోర్ట్స్ హాల్‌లో జరిగిన ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్‌లో హనుమంతు (మెదక్)పై ఆదిత్య వరుస గేముల్లో గెలిచాడు. ఇతర మ్యాచుల్లో వీఎస్‌కే నాయుడు, జగన్, నందుకుమార్, సాయిఈశ్వర్, సాగర్, శివప్రసాద్, రవీందర్‌గౌడ్, శివానందరెడ్డి, విక్రమ్‌కుమార్, నితిన్‌గౌడ్ ప్రత్యర్థులను ఓడించారు.

మలేషియన్ యూనివర్సిటీతో 'గోకరాజు' ఎంఓయూ



ఎంఓయూ కార్యక్రమంలో పాల్గొన్న గోకరాజు ఇంజనీరింగ్ కాలేజీ, కర్టిన్ యూనివర్సిటీ ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అకడమిక్ సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా మలేషియాలోని కర్టిన్ యూనివర్సిటీతో గోకరాజు రంగరాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని కళాశాల ఉపాధ్యక్షుడు జీవీకే గంగరాజు తెలిపారు. శుక్రవారం మలేషియాలో జరిగిన ఎంఓయూ కార్యక్రమం అనంతరం గోకరాజు కళాశాల సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ కేవీఎస్ రాజు మాట్లాడుతూ... అంతర్జాతీయ భాగస్వామ్యాలను సృష్టించేందుకు, విద్యార్థుల ప్రయోజనాలను మెరుగు పరచడానికి మలేషియన్ యూనివర్సిటీతో ఎంఓయూ దోహదపడుతుందన్నారు. తమ కళాశాలల్లో చదువుతున్న బీటెక్ థర్డ్, ఫైనలియర్ విద్యార్థులు మలేషియాలోని కర్టిన్ యూనివర్సిటీ నిర్వహించే ప్రాజెక్టుల్లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కర్టిన్ విశ్వవిద్యాలయం ప్రొ వైస్‌చాన్సలర్ విన్సెంట్ లీ చియెంగ్ చెన్ మాట్లాడుతూ.. ఈ ఎంఓయూ రెండు సంస్థలకు ప్రయోజనకరంగా ఉంటుందని, విద్యార్థులకు, అధ్యాపకులకు అసమానమైన అవకాశాలకు ఉపకరిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గోకరాజు కళాశాల డీన్ స్వదేశ్‌కుమార్ సింగ్, కర్టిన్ విశ్వవిద్యాలయం ప్రతినిధి లిమ్ చై ఇంగ్, డాక్టర్ మూల మోహన్ రెడ్డి, ప్రొఫెసర్ సుజన్ దేబ్‌నాథ్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

గాజులరామారం డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి

కుత్బుల్లాపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాలనీలు, బస్తీలలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని గాజులరామారం డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి పేర్కొన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని ఆయన అన్నారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందినా వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రధానంగా రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, విద్యుత్‌సమస్యలు, పారిశుధ్యంపై దృష్టి పెట్టామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై కఠినమైన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజావాణి కార్యక్రమంలో చెప్పవచ్చన్నారు. సర్కిల్ పరిధిలో చేపట్టబోతున్న, ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలను డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూలో వెల్లడించారు.

సర్కిల్ పరిధిలో అభివృద్ధి పనులు ఎలా సాగుతున్నాయి. ప్రజాసమస్యలను ఏవిధంగా పరిష్కరిస్తున్నారు?

గాజులరామారం సర్కిల్ పరిధిలోని గాజులరామారం, జగద్గిరిగుట్ట, చింతల్, సూరారం డివిజన్ల పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయి. బస్తీలు, కాలనీలలో ప్రజలకు అవసరాల మేరకు రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నాం. ప్రస్తుతం కొంత నిధుల సమస్య ఉండటంతో మందకొండిగా సాగుతున్నాయి. ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం రోడ్ల విస్తరణ, జంక్షన్‌ల అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్యకు చెక్‌పెట్టవచ్చు. స్థానికంగా ఉన్న సమస్యలపై ప్రజావాణిలో ప్రజలు వినతిపత్రాలు అందజేస్తున్నారు. వాటిన్నంటిని పరగణలోకి తీసుకుని దశల వారీగా పరిష్కరిస్తున్నాం.

సర్కిల్ పరిధిలో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉంది. మురుగునీరు రోడ్లపై పారుతుంది. వాటిపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

పారిశుధ్య సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో కాలనీలు, బస్తీలలో పర్యటిస్తున్నారు. రోడ్లపై చెత్తకుప్పలు లేకుండా, రోడ్లపై మురుగు నీరు నిల్వకుండా తొలగిస్తున్నారు. హెచ్‌ఎంటీ పైప్‌లైన్ రోడ్డులో రాంకీ వేస్ట్‌మేనేజ్‌మెంట్ ప్లాంట్ ఉండటంతో కొంత ఇబ్బందికరంగా ఉంది. ప్రస్తుతం సమస్యను పరిష్కరించాం.

సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

అక్రమ నిర్మాణాలపై మా టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎప్పటికప్పుడు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. అక్రమనిర్మాణాలు చేసేవారికి నోటీసులు జారీ చేస్తున్నాం. స్పీకింగ్ ఆర్డర్స్ జారీ చేసిన తర్వాత ఎస్‌టీఎఫ్‌కు రాసి చర్యలు తీసుకుంటున్నాం. ఎంతటి వారైనా నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు.



ప్రభుత్వ పథకాలను ప్రజలకు ఎలా అందిస్తున్నారు?

రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారిని గుర్తించి ఉచిత విద్యుత్, గ్యాస్ పథకాలను అందజేస్తున్నాం. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇప్పటి వరకు ఉచిత పథకాలకు దరఖాస్తు చేసుకోని అర్హులైన వారి నుంచి, అధికారులు, సిబ్బంది ప్రజల నుంచివచ్చే వినతులు సేకరిస్తున్నారు.

చివరిగా ప్రజలకు మీరిచ్చే సందేశం

గాజులరామారం సర్కిల్ పరిధిలోని బస్తీలు, కాలనీలలో నివసించే ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలు అధికారుల తీసుకు రావాలి. పనిదినాలలో రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధికారులు కార్యాలయంలో అందుబాటు ఉంటారు. వారి సమస్యలు తెలియచేస్తే వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటాం

ఆ 50 కాలనీలకు రిజిస్ట్రేషన్ల గ్రహణం

- 1.30 ఎకరాల వక్ఫ్‌బోర్డు స్థలం ఉందంటూ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వక్స్‌బోర్డు కమిటీ ఫిర్యాదు
- దాంతో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు.. ఇబ్బందుల్లో స్థానికులు

షాపూర్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు భూముల పేరుతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 50 కాలనీలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు. ఇందుకు ప్రధాన కారణం నియోజకవర్గ పరిధిలో వక్ఫ్‌బోర్డుకు 1.30 ఎకరాల స్థలం ఉన్నదని వక్ఫ్‌బోర్డు కమిటీ సభ్యులు ఫిర్యాదు చేయడంతో కుత్బుల్లాపూర్ రిజిస్ట్రార్ జ్యోతి బుద్ధప్రసాద్ ఆయా కాలనీలలో రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సూరారం సబ్‌రిజిస్ట్రార్ పరిధిలోని కాలనీలకు చెందిన స్థలాలు రిజిస్ట్రేషన్‌లు చేయరాదని నిలిపివేశారు. భూములు కొన్నవారు అమ్మిన వారు ఇబ్బందులు పడుతున్నారు.

సర్వే నంబర్లు 58 నుంచి 226 వరకు

సర్వేనంబర్లు 58 నుంచి 226 వరకు ఎలాంటి రిజిస్ట్రేషన్‌లు చేయరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చింతల్ గణేష్‌నగర్, మాణిక్యనగర్ నుంచి ద్వారకానగర్, సూర్యానగర్, బాపూనగర్, పద్మానగర్ ఫేజ్ 1, 2, పాపయ్య యాదవ్‌నగర్, కల్పనా సొసైటీ, చెరుకుపల్లికాలనీ, వాణీనగర్, ఇంద్రసింగ్‌నగర్, కాకతీయనగర్, శ్రీనివాసనగర్, బాపూనగర్, అంబేడ్కర్ నగర్‌తోపాటు, పలు కాలనీలు ఈ సర్వేనంబర్ల పరిధిలోకి వస్తాయి.



సూరారంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఆ స్థలాలలో ఇప్పటికే నిర్మాణాలు

వందలాది ఎకరాల స్థలంలో ఇప్పటికే ఇళ్ల ప్లాట్లు చేయగా, కొనుగోలు చేసిన వారు ఇళ్లు, భవనాలు నిర్మించుకొన్నారు. తాజాగా ఆ సర్వే నంబర్లలో వక్ఫ్‌బోర్డు స్థలం ఉన్నదని రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో ఆయా కాలనీల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సర్వే అనంతరం రిజిస్ట్రేషన్లను పునరుద్ధరిస్తామని చెబుతున్న అధికారులు.. వక్ఫ్‌బోర్డు భూమిగా చెబుతున్న 1.30 ఎకరాల భూమి ఏ సర్వే నంబర్‌లో ఉంటే రెవెన్యూ అధికారులు సర్వే చేసి గుర్తించాలని, ఆ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి రిజిస్ట్రేషన్లను పునరుద్ధరించాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు. రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందన్నారు.

రిజిస్ట్రేషన్లను ప్రారంభించాలి



సర్వేనంబర్లు 58 నుంచి 226 వరకు ఉన్న భూములను సర్వేచేసి, ఎక్కడ వక్ఫ్‌బోర్డు స్థలాలు ఉన్నాయో గుర్తించాలి. డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో ప్రభుత్వానికి ఆదాయం రావడం లేదు. భూములను కొనుగోలు చేసిన క్రయ విక్రయదారులూ నష్టపోతున్నారు. త్వరగా సర్వే చేసి భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించాలి.

\- కోలా రవీందర్ ముదిరాజ్, సూరారం

వారం పదిరోజుల్లో సర్వే పూర్తి చేస్తాం



సురారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ గురువారం సందర్శించారు. వారం, పది రోజులలోపు సర్వేను పూర్తి చేసి రిజిస్ట్రేషన్లు యథావిధిగా జరిగేలా చూస్తాం. కుత్బుల్లాపూర్‌లో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరగా పునరుద్ధరించేలా చర్యలు తీసుకొంటాం.

\- మధుసూదన్‌రెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ

రోడ్డుకు ఇరువైపులా వాహనాల పార్కింగ్

షాపూర్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపైనే భారీ వాహనాలను పార్కు చేస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. జీడిమెట్ల బస్ డిపో నుంచి సూపర్ మ్యాక్స్ పరిశ్రమ పక్క నుంచి గాజుల రామారాం వెళ్లే రోడ్డులోని ఎల్‌ఎన్‌టీ కంపెనీ ఎదుట రోడ్డుకు ఇరువైపులా పెద్దపెద్ద కంటెయినర్లను గంటల కొద్ది నిలుపుతున్నారు. దాంతో ఆ రోడ్డు మార్గంలో వెళ్తున్న వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పార్కు చేసిన కంటెయినర్ల మధ్య సందులో నుంచి వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. ఎల్‌ఎన్‌టీ పరిశ్రమ నిర్వాహకులు రోడ్లపై కంటెయినర్లను నిలపకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు.



ఎల్‌ఎన్‌టీ కంపెనీ ఎదుట రోడ్డుకు ఇరువైపులా నిలిపిన వాహనాలు

కుంగిన మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు



మరమ్మతులు చేసిన మ్యాన్‌హోల్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

షాపూర్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కుంగిన మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేశారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'కుంగిన మ్యాన్‌హోల్‌తో పొంచి ఉన్న ప్రమాదం' కథనానికి అధికారులు స్పందించారు. గాజులరామారం నుంచి మెట్కాన్‌గూడకు వెళ్లే రోడ్డులో నాలుగు నెలల క్రితం కుంగిపోయిన మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేశారు. సమస్య పరిష్కారానికి వార్తను ప్రచురించిన 'ఆంధ్రజ్యోతి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని శుక్రవారం మేడ్చల్ డీఎఫ్‌సీఎస్ చైర్మన్ మన్నె రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలపై వారు చర్చించారు.

\- షాపూర్‌నగర్ (ఆంధ్రజ్యోతి)



మూసీ బాధితులకు మద్దతుగా బీజేపీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద మహాధర్నా చేపట్టారు. బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో మహాధర్నాకు తరలి వెళ్తున్న రాజు యాదవ్, రాజుందర్‌రెడ్డి, శ్రీహరి, సత్తి యాదవ్, పుష్ప, పద్మ, మహిళలు

\- జీడిమెట్ల, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి)

మూసీ బాధితులకు మద్దతుగా



మూసీ బాధితులకు అండగా ఇందిరాపార్కు ధర్నాచౌక్‌కు బస్సులో వెళ్తున్న గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి బీజేపీ నాయకులు, కార్యకర్తలు

\- గాజులరామారం (ఆంధ్రజ్యోతి)



రసాయనాల పొగతో...

జీడిమెట్ల పారిశ్రామికవాడలోని వాణి కెమికల్స్ వద్ద ఓ పరిశ్రమ నుంచి రసాయాన విషవాయువులు వెలువడి దట్టమైన పొగ అలుముకుంది. దీంతో రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు, పాదచారులు, స్థానికులు ఊపిరి పీల్చుకోవడానికి తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు.

\- జీడిమెట్ల (ఆంధ్రజ్యోతి)

శారీర దారుఢ్యానికి బాడీ బిల్డింగ్ దోహదం: ఎమ్మెల్యే వివేకానంద్

నిజాంపేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శారీర దారుఢ్యానికి బాడీ బిల్డింగ్ దోహదం చేస్తున్నదని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన క్రాంతికుమార్ ఇటీవల రంగారెడ్డి జిల్లా స్థాయిలో జరిగిన బాడీ బిల్డింగ్ క్రీడా పోటీలలో పాల్గొని విజేతగా నిలిచారు. శుక్రవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశాడు. తాను సాధించిన మెమెంటోను ఎమ్మెల్యేకు చూపించాడు. ఈ సందర్భంగా క్రాంతికుమార్‌ను అభినందిన ఎమ్మెల్యే రాబోయే రోజుల్లో మరినిన విజయాలు సాధించి తెలంగాణ రాష్ట్రానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బలరామ్, ఈశ్వర్, సంపత్, నరేందర్, సాయికిరణ్, వెంకులు, శివ, సాగర్, చందు తదతరులున్నారు.



క్రాంతికుమార్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

21వ అఖిల భారత పశుగణనను పారంభించిన కలెక్టర్ గౌతమ్



పశుగణన పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమ్

16 రకాల జంతువుల వివరాలను సేకరించనున్న అధికారులు

మేడ్చల్ ప్రతినిధి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర, ప్రభుత్వ పాడి, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో 21వ అఖిల భారత గణన కార్యక్రమాన్ని శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ గౌతమ్ ప్రారంభించారు. అందుకు సంబంధించిన పోస్టరును కలెక్టర్ విడుదల చేశారు. నాలుగు నెలలపాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో పాడిపశువులు, గొర్రెలు, మేకలు, పందు లు, గుర్రాలు, కుక్కలు, కోళ్ల వంటి 16 రకాల జంతువుల వివరాలను పక్కాగా సేకరించనున్నారు. ప్రతి ఐదేళ్లకోసారి దేశవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమంలో తాజా లెక్కలను ఘణనను చేయడానికి జిల్లా వ్యాప్తంగా సంబంధిత అధికారులు సిద్ధంగా ఉన్నారు. పశుసంవర్ధకశాఖ అధికారులతోపాటు గోపాల మిత్రలు, ఇతర ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కూడా ఈ గణనలో వినియోగించనున్నారు. గ్రామ, పట్టణ స్థాయిలో ఇంటింటిని సందర్శించి పశువులు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, కుక్కలు, 16 రకాల పెంపుడు జంతువుల వివరాలు సేకరించనున్నారు. వివరాలను పక్కాగా నమోదు చేయడానికి సిబ్బంది ఇంటింటికి వస్తారు. ప్రజలు దీనికి సహకరించాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి టి.సుధాకర్, సహాయ సంచాలకులు ప్రభు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ - 1 పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

జిల్లాలో గ్రూప్- 1 పరీక్ష కేంద్రాలను కలెక్టర్ గౌతమ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ జరుగుతున్న తీరును అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పరీక్ష ప్రశాంతంగా జరుగుతుందా, సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా అని సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పరీక్ష గదులలో తిరిగి పరిశీలించారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

దుండిగల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్‌ను ప్రతి ఒక్కరూ సద్విని యోగం చేసుకోవాలని మల్లంపేట కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ సూచించారు. దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ గ్రామంలో 34మంది లబ్ధిదారులకు శుక్రవారం కౌన్సిలర్ కృష్ణ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ 13 లక్షలు మంజూరు కాగా లబ్ధిదారులకు అందజేశామని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక స్థోమతలేని పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరమని అన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

34 మంది లబ్ధిదారులకు చెక్కుల అందజేత



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ

'స్థానిక' రిజర్వేషన్లపై అభ్యర్థనలు చేసుకోవచ్చు: బీసీ అభివృద్ధి శాఖ అధికారి

మేడ్చల్ ప్రతినిధి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై అభ్యర్థనలు చేసుకోవచ్చని రంగారెడ్డి జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి ఆర్ ఇందిర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థ ఎన్నికలలో రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం నిర్వహించాలనే విషయంలో ఆసక్తిగల పార్టీలు, ప్రజల నుంచి వినతులు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపనలను స్వీకరించడానికి నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. వచ్చే నెల 13 వరకు అన్ని పని దినాలలో కార్యాలయాల వేళల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీసీ కమిషన్ కార్యాలయం, ఖైరతాబాద్‌లో అభ్యర్థనలను దాఖలు చేయాలన్నారు. తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుల బృందం వచ్చే నెల 7న రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ విచారణ చేపడుతుందన్నారు. ఈ బృందంలో బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీసీ వెల్ఫేర్ కమిషనర్‌లతో కూడిన బృందం పాల్గొంటుందన్నారు. ఆయా కులాల స్థితిగతులపై కమిషన్ బృందానికి వ్యక్తులు, నమోదిత, నమోదుకాని అసోసియేషన్లు ఇందులో తమ వాదనలను వినిపించవచ్చునన్నారు. అభ్యర్థులు మెటీరియల్‌తోపాటు సాక్షాలను వారి సంబంధిత కేసులను పేర్కొంటూ స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనవచ్చునని ఆమె వివరించారు. ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన పూర్తి సమాచారం కోసం www.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

సీఎం స్నేహితుడు మా భూమిని కబ్జా చేశారు

- రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకోవాలని బాధితుల విన్నపం

ఖైరతాబాద్/హైదరాబాద్ సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కబ్జాదారులకు పోలీసులు అండగా ఉండి వేధింపులకు పాల్పడుతున్నారని, సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకొని తమ భూమి తమకు అప్పగించాలని బాధితులు వేడుకున్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, ఆయన కుమారుడు రాకేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఉదయ్‌శేఖర్‌రెడ్డి, బాధితులు ఎస్.అరుణాదేవి, ఎస్.కృష్ణ మాట్లాడారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా తిరుమలగిరిలోని సర్వేనంబర్లు 398, 399, 409, 410, 411/1, 411/2, 579లోని మొత్తం 19.18 ఎకరాల భూమిని తాము 1968లో కొనుగోలు చేశామని బాధితులు తెలిపారు. కొంతకాలం క్రితం సీఎం స్నేహితుడు తమ భూమిని కబ్జా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ దాదాపు 100 మంది ఆయుధాలతో తమ స్థలంలో ఉన్నారన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉండి రెండుసార్లు మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన సూర్యనారాయణరెడ్డి సైతం బాధితుడిగా మారినట్లు వారు తెలిపారు. రాచకొండ సీపీని కలవగా తమనే బెదిరించారని, హన్మంతరావు ద్వారా సీఎం రేవంత్ బ్రదర్స్‌ను కలవాలని చెప్పారని ఆరోపించారు. ఈ విషయంపై డీజీపీకి కూడా ఫిర్యాదు చేశామన్నారు. సీఎం రేవంత్ జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు

ఈ భూమి విషయంపై దర్యాప్తు నడుస్తోందని.. ఈ క్రమంలో కొందరు నిరాధారమైన కథనాలు, వీడియోలు పోస్ట్ చేసి ప్రజలను తప్పుదోవ పట్టించడమే కాక, పోలీసులపై, ప్రభుత్వ పెద్దలపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని రాచకొండ పోలీసులు చెబుతున్నారు. ఈ విషయంలో పోలీసులకు, ప్రభుత్వ పెద్దలకు ఎలాంటి సంబంధం లేదని, తప్పుడు ప్రచారం చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లోని హోటళ్లలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఏజీ కాలనీలోని మహ్మదీయ షవర్మలో చికెన్ గ్రిల్‌పై దుమ్ము పడేలా ఉందని, గాలికి ఉంచడంతో కలుషితమయ్యే అవకాశముందని గుర్తించారు. ఆయిల్ ఎక్కువసార్లు వినియోగిస్తున్నట్లు, ఫ్లోరింగ్‌లో ఉన్న పగుళ్ల నుంచి ఎలుకలు వచ్చే అవకాశముందని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. యూసుఫ్‌గూడ రాజీవ్‌నగర్‌లోని అల్‌ఖాసీమ్ ది మండి హౌస్‌లో ఫ్లోరింగ్, ఫ్రీజర్‌లు అపరిశుభ్రంగా ఉన్నాయని, ఎగ్జాస్ట్ ఫ్యాన్ శుభ్రపర్చలేదని, స్టవ్, పాత్రలు శుభ్రపరచలేదని, కొన్ని ఆహార పదార్థాలు నేరుగా ఫ్లోర్‌పై ఉంచినట్టు గుర్తించారు. యూసుఫ్‌గూడలోని అల్‌మటమ్ అల్ మదీనా మండి కిచెన్‌లో మైక్రో ఓవెన్, ఇతర పరికరాలు క్లీన్ చేయడం లేదని, సిబ్బంది హెడ్ క్యాప్‌లు, గ్లోవ్స్ వినియోగించడం లేదని గుర్తించారు. యూసుఫ్‌గూడలోని అల్‌మటమ్ అల్‌హింద్ అరేబియన్ మండిలో అపరిశుభ్రంగా కిచెన్, చిమ్నీలున్నాయని, ఎగ్జాస్ట్ ఫ్యాన్లు క్లీన్ చేయలేదని, కిచెన్ అంతటా ఆహార వ్యర్థాలు ఉండడం, రా మెటీరియల్‌ను ప్రమాణాల ప్రకారం నిల్వ చేయలేదని గుర్తించారు.



ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న అధికారులు

నేడు మేడ్చల్ ఐటీఐలో జాబ్‌మేళా

మేడ్చల్ ప్రతినిధి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఉపాధికల్పన కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం(నేడు) ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మేడ్చల్ ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా అధికారిణి ఎం.రాధిక శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో స్టాఫింగ్ టైటాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో(మల్టీపుల్ జాబ్ రోల్స్) వివిధ రకాల సామర్థ్యంపై ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, ఐటీఐ, ఇంటర్ ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణలై ఉండాలన్నారు. ఆసక్తిగల యువతి యువకులు www.nic.gov.in పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుని ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. వివరాల కోసం 98664 65024, 73868 09422 ఫోన్ నంబర్‌లలో సంప్రదించాలని ఆమె కోరారు.

చాట్ పండుగకు ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చాట్ పండుగ సందర్భంగా ప్రయాణికుల డిమాండ్ మేరకు వేర్వేరు ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. నవంబర్ 2, 9 తేదీల్లో ఛాప్రా-యశ్వంత్‌పూర్ (05185), 4, 11తేదీల్లో యశ్వంత్‌పూర్-ఛాప్రా (05186), 3న ఎస్‌ఎంవీటి బెంగళూరు-ధనపూర్ (06235), 9న ధనపూర్-ఎస్‌ఎంవీటీ బెంగళూరు (06236) రైళ్లను నడుపుతున్నట్టు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, నిర్వహణ కారణాలతో అక్టోబర్ 26న సికింద్రాబాద్-గూడూరు (12710), 27న గూడూరు- సికింద్రాబాద్ (12709) రైళ్లను రద్దు చేసినట్టు తెలిపారు.



రక్షణ కంచెలేని ట్రాన్స్ ఫార్మర్లు

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

గాజులరామారం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. రక్షణలేని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోవడం మండిపడుతున్నారు. గాజులరామారం డివిజన్, మహాదేవపురం చౌరస్తాలో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ తీగల నుంచి రాత్రి సమయంలో మంటలు చెలరేగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుటూ పిచ్చి మొక్కలు పెరిగాయని, ఆహారం కోసం మూగ జీవులు అక్కడికి వెళ్లి విద్యుదాఘాతంతో మృత్యు బారిన పడుతున్నాయని స్థానికులు వాపోయారు. విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కవచంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని మహాదేవపురం వాసులు కోరుతున్నారు.



కొలన్ హన్మంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

నీటి సమస్యను పరిష్కరించండి

దుండిగల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్‌లోని శ్రీరామ్‌నగర్, బాపూనగర్‌లో నీటి సమస్యను పరిష్కరించాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డిని వినతిపత్రం అందజేశారు. కాలనీలలోని వారు ఎదుర్కొంటున్న నీటిసమస్యను వివరించారు. స్పందించిన ఆయన మున్సిపల్ అధికారులతో మాట్లాడారు. మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించి నీటి సమస్యను పరిష్కరిస్తానని కాలనీ వాసులకు హామీనిచ్చారు. కార్యక్రమంలో పెంటయ్య, భాస్కర్, విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, సతీష్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.